

# పతివ్రత

## నాకాని కమల

"మోహిని" స్టూడియో సందడిగా వుంది.

ఆరోజు... ...

"పాతివ్రత్య మహిమ" సినిమా షూటింగ్ ఆఖరి షెడ్యూల్. క్లయిమాక్సు సీను చిత్రీకరణ జరుగుతోంది.

ఆడవాళ్ళచేత కన్నీరు కార్పించే పాత్రల్లో ప్రముఖ నటి, అభినేత్రి "తారశ్రీ"కి పెట్టింది పేరు.

సీత, సావిత్రి, సుమతి లాంటి పతివ్రతల పాత్రల్లోనూ, అమ్మవారి వేషాల్లోనూ తారశ్రీ నటించదు — పాత్రలో లీనం అయిపోతుంది.

మోహిని స్టూడియోస్ ఫస్ట్ ఫ్లోర్‌లో సెట్ వేశారు.

అసలు ఆ సీను అవుట్‌డోర్‌లో తీద్దామను కున్నారు. కాని కొన్ని సాంకేతిక ఇబ్బందుల వల్ల స్టూడియోలోనే ఆఖరి సీను సెట్ వేశారు.

ఒకప్రక్క ఎత్తుగా చెదలు చెదలుగా పెరిగిన పాముల పుట్టలు.

ఆ పుట్టల చుట్టుపట్ల గుబురుగా పెరిగిన వృక్షాలు... ముళ్ళ తుంపలు... రాళ్లు...

ఆ పాముల పుట్టలకి కొస్త దూరంలో ఓ పదేళ్ళ బాలుదు స్పృహతప్పి పడి వున్నాడు.

ఆ బాలుడి శరీరం నల్లగా కమిలిపోయింది.

బాలుడి నోట్లోంచి తెల్లగా నురగ వస్తోంది.

ఆ బాలుడ్ని తాచు కాటేసింది.

హీరోయిన్ వేషంతో 'తారశ్రీ' ఆ పుట్ట ముందే కూర్చుంది.

ఆ సినిమాలో ఆమె ఆ బాలుడి తల్లి. మహా పతివ్రత. నాగదేవత భక్తురాలు. భర్త రోగిష్టి వాడు. పేదరికంలో మగ్గిపోతున్న ఆమె పాతివ్రత్యాన్ని వీడకుండా భర్తకి సేవలు చేసుకుంటూ, బిడ్డని పోషించుకుంటూ అడివిలో కట్టెలు కొట్టుకుని, అదే జీవనాధారంగా రోజులు నెట్టుకుని వస్తూంది.

అటువంటి స్థితిలో పుట్ట దగ్గరకి వెళ్లిన కొడుకుని పాము కాటేసింది.

కాషాయం రంగులో వున్న తడి బట్టల్ని ఒంటికి చుట్టుకుని, చేతులకు, మెడకి రుద్రాక్ష మాలలు అలంకరించుకుని ఆ బాలుడి తల్లి, నాగదేవత భక్తురాలు అయిన హీరోయిన్ పుట్టముందు కూర్చుని నాగదేవతని ప్రార్థిస్తుంది.

గద్గద స్వరంతో పాట పాడుతూంది.

తన బిడ్డని బ్రతికించమని వేడుకుంటూంది.

మృతుడైన బిడ్డ తలని ఒళ్ళో పెట్టుకుని కంటికి ధారగా ఏడుస్తూంది.

తను కొలిచే దేవతే తన కడుపున చిచ్చు రగిలిస్తే తనకి దిక్కు ఎవరని, పాలు పోసిన తనకి, విషాన్ని చిందించడం న్యాయమా అని నిలదీస్తూంది...

క్లయిమాక్స్ సీన్ చిత్రీకరణ అద్భుతంగా నడుస్తూంది.

ఆ పాత్ర...

పాత్రకితగ్గ హావభావాలు... పరిణతి చెందిన తారశ్రీ నటన...

ఉన్నత సాహిత్యంతో కూడిన పాట...

పాటకి తగ్గ సంగీతం...

తారశ్రీ ముఖ కవళికల్ని ఇనుమడింపజేస్తూ క్లోజప్‌లో కెమెరా కదులుతూంది.

హీరోయిన్ పాట సగం అయ్యేసరికి పుట్టలోంచి నల్లగా నిగనిగలాడుతూ బారెడు పొడవున్న తాచు పైకి వచ్చింది.

నేలమీద పడివున్న బిడ్డ ముందుకి వచ్చి పడగ నేలకి వాల్చి, కాటువేసిన చోటునుంచి విషాన్ని వెనక్కి తీసుకుంది నాగదేవత.

తిరిగి మెల్లగా పుట్టలోకి జారిపోయింది.

అంతవరకు విగతజీవుడై నురగలు కక్కుతూ పడివున్న ఆ పసివాడు 'అమ్మా' అంటూ లేచి కూర్చున్నాడు.

హీరోయిన్ పాట ఆపకుండానే రెండు చేతులు జోడించింది.

"నమ్మిన తల్లిని నట్టేట ముంచవని నమ్మకమే నాకుంది..." అంటూ హీరోయిన్ పాడింది.

వాయిద్యాల మోత పెరిగింది.

***

"కట్" అన్నాడు దర్శకుడు.

'క్లిక్' అంటూ ఫ్లోర్‌లో లైట్లు ఆరాయి.

"గుడ్ షాట్"

"ఎక్సలెంట్"

"ఫెంటాస్టిక్! నిజంగా మీ నటన పాత్రకి జీవం పోసింది. పామునైతం మీ పాతివ్రత్యానికి ఝడిసిందా అన్నంత ఎఫెక్టివ్‌గా వచ్చింది సీను" అంటూ దర్శకుడు అభినందనలతో ఆమెని ముంచెత్తాడు.

సహదర్శకుడు, కెమెరా మెన్, మ్యూజిక్ డైరెక్టర్, రచయిత, తదితర సాంకేతిక వర్గం అంతా 'తారశ్రీ' చుట్టూ చేరి ప్రశంసల వర్షం కురిపించారు.

"సమయానికి నిర్మాత వెంకునాయుడు గారు లేరు. లేకపోతే వెంటనే మిమ్మల్ని తమ తదుపరి చిత్రంలో బుక్ చేసుకునే వారే మేడమ్" అన్నారు మూకుమ్మడిగా.

నిర్మాత లేకపోవడం లోటుగానే వుంది. సరిగ్గా షూటింగ్ మొదలయ్యే వేళ్టికి ఎక్కడ్నుంచో అర్జంటు ఫోన్ రావడంతో వెళ్ళాడు నిర్మాత.

"మన చిత్రం బాక్సాఫీసు హిట్. ప్రేక్షకులంతా మీ నటనకి కన్నీరు కార్చాల్సిందే. కనకవర్షం కురుస్తుంది" సెట్‌లోని యూనిట్ తారశ్రీని ఆకాశానికి ఎత్తింది.

ఆ అభినందనలకి ఉక్కిరిబిక్కిరి అయింది తారశ్రీ.

అదంతా ఆమెకు అలవాటే.

అయినా ఎప్పటికప్పుడు కొత్తగా వుంటుంది.

గొంతు లోంచి తన్నుకుని వస్తున్న ఆనందాన్ని అదుపుచేసుకుంటూ తారశ్రీ రెండు చేతులూ జోడించింది.

"థ్యాంక్స్. ఇందులో నా నటనకంటే మీ అందరి సహకారమే గొప్పది" అంటూ ఆ గుంపు నుంచి తప్పించుకుంటూ సెట్‌లోంచి బయటికి వచ్చింది.

"నాకు చాలా అలసటగా వుంది. ఐవాంట్ రెస్ట్" అంటూ గబగబా తన మేకప్ రూమ్‌లోకి వచ్చి తలుపులు మూసుకుంది.

అద్దం ముందు నిల్చుని మేకప్ తియ్యసాగింది. అంగుళం మందాన ముఖానికి అట్టలా పట్టుకున్న మాస్క్, ఒంటికి అంటుకున్న తడి బట్టలు, చేతులకి మెడకి గరుకుగా గుచ్చుకుంటున్న రుద్రాక్షలు, కంపు కొడుతున్న బారెడు విగ్గు......

పరమ చిరాగ్గా వుంది.

'స్నానం చెయ్యాలి' అనుకుంటూ స్టాండ్ మీద వున్న టవల్ అందుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళబోయింది.

ఇంతలో—

బయట తలుపుదగ్గర శబ్దం అయ్యింది.

"టక్... టక్......" ఎవరో గొళ్ళెంతో తలుపుమీద అదే పనిగా కొడుతున్నారు.

'ఉష్... ఒక్క నిమిషం ఒంటరిగా వుండనివ్వరు కదా?' అనుకుంటూ మంచంమీద పడివున్న వల్లెవాటుని ఒంటినిండా కప్పుకుంటూ తలుపు దగ్గరకి వచ్చి—

"ఎవరూ! స్నానానికి వెడుతున్నాను" అంది.

"ఎవ్వరూ లేరు. నేనేలే. తానం తర్వాత చెయ్యొచ్చు. ముందు తలుపు తియ్యి" అన్నాడు.

నిర్మాత వెంకునాయుడి గొంతు వింటూనే వస్తున్న చికాకుని అణుచుకుంటూ గడియ తీసి ఓరగా తలుపు తెరిచింది.

దూకుడుగా లోపలికి వచ్చిన నాయుడు తిరిగి గడియలు బిగిస్తూ—

"షాట్ గొప్పగా వచ్చిందంట గదా! మవాళ్ళంత తెగ మురిసిపోతుండారు. మూ్డ్రోజుల పండుగ తప్పదంట. ఏంటి సంగతి?" అంటు ఆమె నడుం చుట్టూ చేతులు వేశాడు.

సారా కంపు గుప్పున కొట్టింది.

నాయుడు కోటీశ్వరుడు. కాని మోటువాడు. పీమ పరుకులో నాటు సారా కలుపుకుని తాగుతాడు. ఎప్పుడూ పాన్ నములుత్తూ, చుట్ట తాగుతాడు.

తారశ్రీ వెగటుగా ముఖం తిప్పుకుంది.

"అబ్బ! ముందు స్నానం చెయ్యాలి వదలండి" అంది అతడ్ని తప్పించుకుంటూ.

నాయుడు పెళపెళ నవ్వాడు.

"ప్రేక్షకుల దగ్గర పతివ్రత పోజులు కొట్టు కాని నా దగ్గర మాత్తరం అయ్యన్ని ఇడిసి పెట్టు" అంటూ ఆమెని మరింత గట్టిగా ఒడిసి పట్టాడు.

సారా కంపు కడుపంతా తిప్పుతుంటే, భల్లూకంలా తనని ఒడిసి పడుతున్న ఆ నాయుడ్ని విదిలించుకోలేక అసహనంగా తలపక్కకి తిప్పుకుంది తారశ్రీ.

వృత్తికి — ప్రవృత్తికి పొంతన కుదుర్చుకోలేని ఆమె బేల మనసు బాధగా మూల్గింది. ●

# ఫాదర్ ఆఫ్ ఇండియన్ కార్టూన్



అది 1932వ సంవత్సరం-

ఓ యువకుడు ఫుట్‌పాత్ మీద నడుచుకుంటూ వెళుతున్నాడు...

ఇంతలో పక్కనే వెళ్తున్న బస్సులోంచి ఒక వ్యక్తి దూకి అతడ్ని కౌగలించుకొని అభినందించాడు...

ఆ యువకుడే కార్టూనిస్ట్ శంకర్!

ఆ వ్యక్తి హిందుస్థాన్ టైమ్స్ సంపాదకుడు పోథెన్ జోసెఫ్.

అప్పటికే 'బాంబే క్రానికల్', 'ఫ్రీ ప్రెస్ జనరల్' పత్రికల్లో గీసిన కార్టూన్ల ద్వారా పాపులర్ అయిన శంకర్‌ని మనసారా ప్రశంసించాడు జోసెఫ్.

అంతేకాదు-హిందుస్థాన్ టైమ్స్‌లో స్టాఫ్ కార్టూనిస్ట్‌గా ఉద్యోగం ఇచ్చాడు.

అప్పటి నుంచీ శంకర్ ఈ పత్రికబుద్ధుల ప్రపంచం మీద ఎడాపెడా కార్టూన్లు గీయసాగాడు.

శంకర్ అసలు పేరు కేశవశంకర్ పిళ్ళై. 1902లో కేరళలో జన్మించాడు.

భారతదేశంలో రాజకీయ కార్టూన్లకి శ్రీకారం చుట్టింది శంకరే!

అప్పటి బ్రిటిష్ పాలకుల మీద పదునైన కార్టూన్లు వేసేవాడు. ఐతే వాళ్ళకున్న సెన్సాఫ్ హ్యూమర్ శంకర్‌ని కాపాడేది.

అప్పటి వైస్రాయి లార్డ్ విల్లింగ్‌టన్ సైతం తన మీద శంకర్ విసిరే పూలబాణాల్లాంటి కార్టూన్లు చూసి నవ్వుకునేవాడు.

నెహ్రూ అంతటివాడు శంకర్ తన మీద ఏ కార్టూను వేస్తాడోనని ఏ రోజుకారోజు భయపడేవాడు. అయినా శంకర్‌తో జవహర్‌కి మంచి స్నేహం వుండేది. శంకర్ శైలిని ఆయన అమితంగా ఇష్టపడేవాడు. పద్నాలుగు సంవత్సరాలు హిందుస్థాన్ టైమ్స్‌లో పనిచేసిన తరువాత బయటకు వచ్చి 1948లో శంకర్స్ వీక్లీ ప్రారంభించాడు. ఈ పత్రిక భారతీయులకు ఓ కొత్త ప్రయోగం! ఓ.విజయన్, అబూ, కుట్టి, రంగా వంటి ప్రముఖ జాతీయ కార్టూనిస్టులను ప్రోత్సహించింది శంకర్స్ వీక్లీయే! ఈ పత్రిక ఇరవై ఏడు సంవత్సరాలపాటు విజయవంతంగా వెలువడి ఎమర్జన్సీ సమయంలో ఆగిపోయింది.

శంకర్‌కు పాశ్చాత్య కార్టూనిస్టులలో డేవిడ్‌లో, స్ట్రాబ్‌ల కార్టూన్లంటే ఇష్టం.

"భారతీయులకు సెన్సాఫ్ హ్యూమర్ తక్కువ" అంటాడు శంకర్. దానికి కారణం నిరక్షరాస్యత అంటాడు.

పిల్లలంటే శంకర్‌కు చాలా ఇష్టం. పిల్లల కోసం డాక్టర్ బి.సి.రాయ్ లైబ్రరీ, చిల్డ్రన్స్ బుక్ ట్రస్ట్ స్థాపించాడు. ప్రతి ఏటా పిల్లల కోసం అంతర్జాతీయ స్థాయిలో చిత్రలేఖన పోటీలు భారీ ఎత్తున నిర్వహించేవాడు.

భారత ప్రభుత్వం ఆయనకు 'పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ! అవార్డులు ఇచ్చి గౌరవించింది.

ఈనాటి పొలిటికల్ కార్టూనిస్టులు రిఫర్ చేయాల్సిన శాస్త్రమూ, నిఘంటువూ శంకర్.

ప్రముఖ కార్టూనిస్ట్ ఓ. విజయన్ అన్నట్టు "ఆయన ఫాదర్ ఆఫ్ ఇండియన్ కార్టూన్."

— శ్యాంమోహన్



భాషాశాస్త్రం ప్రతిపాదనపల్ల తాము ఎముఖుడ్ని కాదని నెహ్రూ ప్రకటించడం మీద శంకర్ మే 3, 1953న ఈ కార్టూన్ వేశారు.